## విహారయాత్రలో పాఠశాల విద్యార్థులు



పోచారంలోని జింకల పార్కులో బోర్లం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 16 : మండలంలోని బోర్లం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు విహారయాత్రకు వెళ్లారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడం, రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాలు, అడవులపై అవగాహన కల్పించేందుకు విహార యాత్రకు తీసుకెళ్లారు. ఇందులో భాగంగా పోచారం డ్యాం, పోచారం అభయారణ్యంలోని జింకల పార్కు, ఆసియాలోనే ప్రసిద్ధిగాంచిన చర్చి తదితర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి వాటి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. ఉపాధ్యాయులు సంతోష్, రజినీ కాంత్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## లక్‌పతి దీదీల ఎంపికపై వీవోఏలకు శిక్షణ

దోమకొండ, ఫిబ్రవరి 16: లక్‌పతి దీదీల ఎంపికపై వీవోఏలకు శిక్షణ, మహిళల జీవనోపాదుల ఎంపిక, కల్పన చేసి లక్‌పతి దీదీలుగా మార్పు చేయడంపై ఉమ్మడి దోమకొండ, బీబీపేట మండలాల గ్రామ సంఘాల కార్యకర్తలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏలు ప్రతి గ్రామ సంఘం పరిధిలో 80 మంది మహిళలను గుర్తించి వారికి జీవనోపాధి కల్పించి వారిని లక్‌పతి దీదీలుగా మార్చనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా టీవోటీ సుధాకర్, డీపీఎం ఐబీ గంగాధర్ ఏపీఎం రాజు, బాల పోచయ్య, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

## పర్మిట్ రూమ్‌లో వ్యక్తి మృతి

భిక్కనూరు, ఫిబ్రవరి 16 : భిక్కనూరు వైన్స్ షాపు పర్మిట్ రూమ్‌లో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మోటాట్‌పల్లి గ్రామానికి చెందిన తుప్పతి బక్క సాయిలు(54) గురువారం రాత్రి ఇంటి నుంచి మద్యం తాగడానికి భిక్కనూరులో ఉన్న ఓ వైన్స్‌కు వెళ్లాడు. పక్కనే ఉన్న పర్మిట్ రూంలో మద్యం తాగుతుండగా తాను కూర్చున్న ప్లాస్టిక్ కుర్చీ పైనుంచి కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకు న్న కుటుంబసభ్యులు పర్మిట్ రూం వద్దకు వచ్చి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

దోమకొండ, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డులో శుక్రవారం ఆర్టీసీ బస్సును ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాములు తన బైక్‌ను వెనుకకు తీసే క్రమంలో దుబ్బాక ఆర్టీసీ డిపో బస్సు తగిలి తీవ్ర గాయాలు కాగా వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఎస్సై గణేశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

# ప్రజలకు అవగాహన కల్పించాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 16 : సంప్రదాయ చేతివృత్తులు, హస్త కళాకారులను బలోపేతం చేయడంతోపాటు ఆర్థికంగా చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు కలెక్టర్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చేతి కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి సామర్థ్యాన్ని మెరుగుపరిచి ఉత్పత్తి ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. పథకంలో చేరిన వారికి సర్టిఫికెట్, గుర్తింపు కార్డు, శిక్షణ రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకం, మార్కెటింగ్‌లో ప్రభుత్వం మద్దతు అందిస్తుందని తెలిపారు. కమ్మరి, కుమ్మరి, స్వర్ణకారులు, శిల్పులు, వడ్రంగులు వంటి 18 కేటగిరీల్లో పని చేస్తున్న చేతి వృత్తులు, హస్తకళల వారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చని అన్నారు. ఇతరులపై ఆధారపకుండా స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు.




మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి 5 నుంచి 7 రోజుల పాటు ప్రాథమిక నైపుణ్యం, 15 రోజులు శిక్షణతోపాటు రోజుకు రూ.500 భృతి ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంఎస్ఎం సహాయ సంచాలకులు రాజేశ్‌యాదవ్, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు రఘునాథ్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

బీబీపేట్, ఫిబ్రవరి 16 : మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో నాబార్డ్ సహకారంతో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని 30 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై శుక్రవారం ఉచిత శిక్షణ ఇచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. 15 రోజుల శిక్షణలో భాగంగా మహిళలకు మధ్యాహ్న భోజనంతోపాటు రోజుకు రూ.50 చొప్పున మొత్తం రూ.750 స్టైఫండ్ అందజేయనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నాబార్డ్ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీవో లీడర్ లక్ష్మి, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం, చంద్రమౌళి, మహిళలు పాల్గొన్నారు.




మహిళలకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్

## భరోసా సెంటర్ సేవలు ప్రారంభం

కామారెడ్డి, ఫిబ్రవరి 16 : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న గ్రీమ్ హోమ్ కాలనీలో భరోసా సెంటర్‌ను ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాధిత మహిళలు, బాలలు అధైర్య పడకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవడంలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఈ భరోసా సెంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రం 24/7 సహాయకారిగా ఉంటుందని తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలలకు దవాఖాన, పోలీసు స్టేషన్‌కు దూరంగా ఒక మంచి వాతావరణంలో వైద్యం, న్యాయ సలహా, కౌన్సెలింగ్ వంటి అన్ని సౌకర్యాలు ఒకే గొడుగు కింద అందించడం దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. ట్రైనీ ఐపీఎస్ ఎంఎస్ కాజల్ సింగ్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



భరోసా సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సింధూశర్మ

## కిసాన్ క్రెడిట్ కార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

దోమకొండ, ఫిబ్రవరి 16 : చిన్న సన్నకారు రైతులు కిసాన్ క్రెడిట్ కార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ తిర్మల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభు త్వం ద్వారా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు చేపల పెంపకం ప్రోత్సహించడానికి రూ.లక్షా అరవై వేల రుణాన్ని వెటర్నరీ శాఖ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు రుణంతో పశువుల పెంపకంతో లాభాలను ఆర్జించాలని సూచించారు. వాయిదా పద్ధతిలో రుణాలను సక్రమంగా చెల్లించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో దోమకొండ వెటర్నరీ ఏడీ శ్రీనివాస్, మండల వెటర్నరీ డాక్టర్ శివ కుమార్, నరేశ్, బ్యాంకు మేనేజర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్పీటీసీ తిర్మల్ గౌడ్

## భౌతిక దాడులకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్‌గౌడ్

మాచారెడ్డి, ఫిబ్రవరి 16 : గ్రామాల్లో కిడ్నాప్ ముఠాలు వచ్చాయంటూ వదంతులు సృష్టిస్తూ, గ్రామాల్లోకి వస్తున్న కొత్త వ్యక్తులపై దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాల్వంచమర్రి వద్ద గ్రామస్తులతో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎక్కడో జరిగిన సంఘటనను పక్కగ్రామాల్లో జరిగినట్లు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, గ్రామానికి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

దోమకొండ, ఫిబ్రవరి 16 : మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఎస్సై గణేశ్ తెలిపారు. దోమకొండ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలు జరుగకుండా ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. దోమకొండతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలను ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు భవిత సెంటర్ శుక్రవారం వైద్య సిబ్బంది ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ.. పాఠశాలలోని 15 మంది దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేసినట్లు చెప్పారు. పిల్లలకు ఇంటి దగ్గర చేయాల్సిన వ్యాయామం గురించి సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా అలీం

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 16 : బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా ఎంఏ అలీం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్, పాలకవర్గం, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సగౌండ, హకీం, రఫీక్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు వీడ్కోలు

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 16 : బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేశ్ బదిలీ కావడంతో శుక్రవారం పట్టణంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల సీనియర్ నాయకుడు ఎజాస్, ఆత్మకమిటీ చైర్మన్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గోశాలకు నగదు అందజేత

మద్నూర్, ఫిబ్రవరి16 : తమ బాల్య మిత్రుడు పవన్‌కుమార్ రెండో వర్ధంతి సందర్భంగా పలువురు యువకులు గోశాలకు శుక్రవారం నగదును అందజేశారు. మిత్రుడి జ్ఞాపకార్థం రూ.9,616 నగదును గోశాల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు రఘు, నాందేవ్, బాలు, సంతోష్, గౌస్, విఠల్, హన్మాడ్లు తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి కోసం వివరాలు అందజేయాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 16: గృహలక్ష్మి పథకం ద్వారా లబ్ధి పొందేందుకు వివరాలు అందజేయాలని ట్రాన్స్‌కో డీఈఈ గణేశ్ వినియోగదారులకు సూచించారు. ఎల్లారెడ్డిలోని ఫీజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. కుటుంబ యజమాని ఆధార్, రేషన్, మీటర్ నంబర్ వివరాలు సిబ్బందికి అందజేయాలన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు గయాజుద్దీన్, సామెల్, షెకావత్ అలీ తదితరులు ఉన్నారు.

## జాతీయ బీసీ సంఘం జిల్లా కార్యదర్శిగా రాజులు

గాంధారి, ఫిబ్రవరి 16: జాతీయ బీసీ సంఘం జిల్లా కార్యదర్శిగా గాంధారికి చెందిన బండి రాజులు నియమితులయ్యారు. దీంతో సంఘం మండల నాయకులు ఆయనను శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన వ్యక్తి జిల్లా కార్యదర్శిగా నియమితులవడం సంతోషకరమైన విషయం అన్నారు. నాయకులు నక్కంటి రవి, తాటిపాముల సత్యం, పనుకంటి నవీన్, సామాల రాజు, స్వామి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల తనిఖీ

నిజాంసాగర్, ఫిబ్రవరి 16: మండలంలోని మాగి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి దేవీసింగ్ శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా ఆయన విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా..? మధ్యాహ్న భోజనం సక్రమంగా అందిస్తున్నారా అనే వివరాలను సేకరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## క్రీడలతో మానసికోల్లాసం

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు

పిట్లం, ఫిబ్రవరి 16: క్రీడలు యువతకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మండలకేంద్రంలోని వివేకానంద పాఠశాల ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. యువత క్రీడలపై ఆసక్తిని చూపాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేశ్‌శెట్కార్, క్రీడల నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, జంబిగె హన్మాడ్లు, సూరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన చిల్లర్గి గ్రామంలో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు.




విజేతలకు బహుమతిని ప్రదానం చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

*వినతిపత్రం అందజేత..*

బిచ్కుంద, ఫిబ్రవరి 16: 317 జీవోతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేను బిచ్కుందలో కలిసి తమ గోడును వెలిబుచ్చారు. 317 జీవో కారణంగా తాము కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్, నీలిమా, అనుష, విజయ, శ్రీలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో అడిషనల్ కలెక్టర్ దంపతుల పూజలు



ఆలయంలో అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ దంపతులు

రామారెడ్డి, ఫిబ్రవరి 16: మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ఉన్న గుడిగంటల శివాలయంలో అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి మురళి వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండి పోచయ్య, వీడీసీ సభ్యులు గాండ్ల ప్రవీణ్, పల్లె రాజేందర్, మల్లారెడ్డి, నర్సయ్య, రాజయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

ఎల్లారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్/ పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు సంఘాలు ఇచ్చిన సమ్మెకు కార్మికులు మద్దతు తెలిపారు. ఈమేరకు పలు మండలాల్లో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చేపట్టిన దేశవ్యాప్త బంద్‌కు పెద్దకొడప్‌గల్‌లో డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌరస్తా వద్ద డ్రైవర్స్ అసోసియేషన్ బాధ్యుడు మస్తాన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు షేక్ రషీద్, అనీఫ్ ఖాన్, అమర్‌సింగ్, అజీమ్, ముజీబ్, రవి తదితరులు పాల్గొన్నారు. ప్రొసీడింగ్ ఆర్డర్లు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు ఎల్లారెడ్డిలోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు తమ సమస్యల గురించి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ తల్లి ప్రాంగణం నుంచి వారు నినాదాలు చేస్తూ.. ర్యాలీగా బయల్దేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకుల బకాయి బిల్లులు, వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సభ్యులు ఉన్నారు. ఎల్లారెడ్డిలో బల్దియా కార్మికులు ర్యాలీ, ధర్నా చేపట్టారు. బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సాయికృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, మల్లేశ్, సాయమ్మ, మహేందర్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.




ఎల్లారెడ్డిలో ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు



ఎల్లారెడ్డిలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



పెద్దకొడప్‌గల్‌లో నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఘనంగా బారడి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

బిచ్కుంద, ఫిబ్రవరి16: మండలంలోని హస్గుల్ గ్రామంలో బారడి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకొని భాజాభజంత్రీల చప్పుళ్లతో ఆలయానికి చేరుకొన్నారు. ఆలయంలో బోనాలతోపాటు నైవేద్యాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రాజెక్టును సందర్శించిన ఓయూ విద్యార్థులు



పోచారం ప్రాజెక్టు వద్ద విద్యార్థులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 16: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టును ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న 53 మంది విద్యార్థులు ప్రాజెక్టును పరిశీలించారు. వంద సంవత్సరాల క్రితం నిజాం రాజు నిర్మించిన ప్రాజెక్టు వివరాలను తెలుసుకున్నారు. నీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు వారికి రాతి కట్టడం, ప్రధాన కాలువ వివరాలు, గొలుసుకట్టు చెరువులకు సాగు నీటి సరఫరా వంటి అంశాలను వివరించారు. విద్యార్థులతో పాటు యూనివర్సిటీ ప్రొఫెసర్లు రాజశేఖర్, రాధిక తదితరులు ఉన్నారు.

## అదృశ్యం కేసు నమోదు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 16: మండలంలోని బాలాజీనగర్ తండాకు చెందిన రుడావత్ గణేశ్ కనిపించడం లేదని అతడి భార్య సుధ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. గణేశ్ కొన్ని రోజుల క్రితం ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్ ఫసీయొద్దీన్ లారీపై పనికి వెళ్లాడు. అప్పటి నుంచి ఫోన్ చేస్తే లేపడం లేదు. లారీ డ్రైవర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తున్నదని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నది.

## పుస్తకాల పంపిణీ

నిజాంసాగర్, ఫిబ్రవరి 16: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉన్న గ్రంథాలయాలకు శుక్రవారం పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నిజాంసాగర్‌లోని విద్యా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి, వీరేందర్ పాల్గొన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా పుస్తకాల నిర్వహణ చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు వరలక్ష్మి, శంకర్‌గౌడ్, ఐఈఆర్టీ సాయిలు, సిబ్బంది పంచాక్షరి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యలో సేవకు భక్తులు



ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు

మద్నూర్, ఫిబ్రవరి16: మండలకేంద్రం నుంచి పది మంది యువకులు శుక్రవారం అయోధ్యకు తరలివెళ్లారు. పాతబస్టాండ్ హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు అయోధ్య రామాలయం వద్ద అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అక్కడ సేవలను అందించిందేకు తాము తరలివెళ్తున్నామని వారు తెలిపారు. గ్రామస్తులు యువకులకు వీడ్కోలు పలికారు.

## రైతులకు ఈ కేవైసీపై అవగాహన

రామారెడ్డి, ఫిబ్రవరి 16: మండలంలోని కన్నాపూర్, ఇసన్నపల్లి, పోసానిపేట్ తదితర గ్రామాల రైతులకు ఈ-కేవైసీపై మండల వ్యవసాయాధికారి సామ హరీశ్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పొందుతున్న రైతులు ఆధార్, మొబైల్ నంబర్‌ను లింక్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆకుల గాయత్రీ, ప్రణీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రానికి తరలిన కార్మికులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 16: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్‌గొండ ఆధ్వర్యంలో జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి శుక్రవారం 500 మంది కార్మికులు జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని, స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కామారెడ్డికి తరలిన వారిలో అంగన్‌వాడీ, ఆశ, పంచాయతీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఉన్నారు.



కామారెడ్డికి తరలివెళ్తున్న కార్మికులు